క్లుప్తంగా

జాతీయస్థాయి విలు విద్య పోటీలకు ఎంపిక



దోమకొండ: జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు దోమకొండకు చెందిన క్రీడాకారిణి ఇందు ఎంపికైనట్లు అర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్ తెలిపారు. ఈనెల 11నుంచి 13 వరకు మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోటీలు జరుగగా, వాటిలో ఇందు విజయం సాధించిందన్నారు. గుజరాత్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. పలువురు అభినందించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పోచారం, ధర్మారెడ్డి, తాండూర్ గ్రామాల్లో గల పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు జగదీశ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల పరిధిలో గల ఓటర్ల సంఖ్య, వారిలో పురుషులు, మహిళల సంఖ్య వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలలో ఉన్న వసతులపై ఆరా తీశారు. అంతకుముందు నాగిరెడ్డిపేట తహసీల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ రాందాస్, ఎస్సై రాజు, ఆర్ఐ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

మైలారంలో..



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారం గ్రామంలో గల పోలింగ్ కేంద్రాన్ని ఎంపిడివో రాము పరిశీలించారు. మంగళవారం బూత్‌లో గల కరెంటు,నీటి వసతి, బాత్రూం సౌకర్యాలను పరిశీలించారు. సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది రాకుండా అన్ని రకాల వసతిని కల్పించామన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

మాక్ పోలింగ్



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో మంగళవారం మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు మాక్ పోలింగ్‌లో పాల్గొని విధులు నిర్వహిస్తూ ఓటింగ్ చేశారు. ఓటు విలువపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్, అధ్యాపకులు, తదితరులున్నారు.

ఉచిత మధుమేహ వైద్య శిబిరం



పిట్లం(జుక్కల్): లయన్స్ క్లబ్(పిట్లం) ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఉచిత మధుమేహ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్ మాట్లాడుతూ.. నవంబర్ 14 మధుమేహ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ప్రజల కోసం ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పలువురికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సంజీవ్‌రెడ్డి, సభ్యులు కాశిరెడ్డి, వేణు గోపాల్, రాజు, తదితరులున్నారు.

కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- పలువురు బీఆర్‌ఎస్‌లో చేరిక



మద్దికుంటలో మాట్లాడుతున్న గంప గోవర్ధన్



బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, పక్కన ఎంపీపీ నర్సింగ రావు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి, సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ కోరారు. జిల్లా కేంద్రంలో ఆయన నివాసం వద్ద మంగళవారం పార్టీలో చేరికల కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ షేరి సుభాష్ రెడ్డిల ఆధ్వర్యంలో భవానీపేట, సింగరాయిపల్లి, శాబ్దిపూర్ గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు, జిల్లా కేంద్రానికి చెందిన మహిళలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రభుత్వవిప్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రవేశ పెట్టిన పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. మాచారెడ్డి జెడ్పీటీసీ రాంరెడ్డి, ఎంపీపీ నర్సింగ్ రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే 3 గంటల కరెంటే

రామారెడ్డి: కాంగ్రెస్ ఓటేస్తే 3 గంటలకు మించి రైతులకు కరెంట్ ఇవ్వరని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ విమర్శించారు. మంగళవారం కేసీఆర్‌ను గెలిపించాలని కోరుతూ మద్దికుంటలోని బుగ్గ రామలింగేశ్వరుడికి పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం రెడ్డిపేట, అన్నారం గ్రామాలలో ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా మద్దికుంటలో గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. భూములు లాక్కుంటారని కేసీఆర్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారని, కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కేసీఆర్ కామారెడ్డిలో పోటీ చేయడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గోజారి లచ్చిరెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు.మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, నిజామాబాద్ జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మాచారెడ్డి ఎంపీపీ నర్సింగ్‌రావు, రామారెడ్డి ఎంపీపీ దశరథ్ రెడ్డి, మద్దికుంట సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ రాజేందర్ పాల్గొన్నారు.

కామారెడ్డి అభివృద్ధి కోసమే కేసీఆర్ పోటీ..

మాచారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసమే కేసీఆర్ పోటీ చేస్తున్నారని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. మంగళవారం మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేట, సోమారంపేట, బంజపల్లి, రత్నగిరిపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు.

గడపగడపకు కేసీఆర్ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే

- జుక్కల్ అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే

నిజాంసాగర్(జుక్కల్): హనుమంతుని గుడి లేని ఊరు లేదని సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందని ఇల్లు ఉండదని బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే అన్నారు. మంగళవారం జుక్కల్ మండలంలోని పెద్దగుల్లా, గుల్లా తండా, పెద్ద ఎడ్గి, కండెబల్లూర్, బస్వాపూర్ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సింధే మాట్లాడుతూ.. కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల ప్రజలు, నాయకులు కేసీఆర్ పథకాలను మెచ్చుకుంటున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ సేవలు దేశానికి ఉపయోగపడేలా ఉన్నాయని, కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. నాయకులు నీలుపటేల్, శివానంద్, సాయాగౌడ్, రవీపటేల్ తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో పీఈటీ నరేష్‌రెడ్డి

లింగంపేట(ఎల్లారెడ్డి): భవానిపేట ఉన్నత పాఠశాలలో ఉమ్మడి నిజామాబాదు జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు నీల రాజు తెలిపారు. భవానిపేట ఉన్నత పాఠశాలలో చదువుతున్న దీపిక, రమ్య, సందీప్‌లు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 15 నుంచి తూప్రాన్‌లో జరగబోయే పోటీల్లో పాల్గొంటారన్నారు.

నాగిరెడ్డిపేట నుంచి..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తూప్రాన్‌లో జరగనున్న 33వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీలకు నాగిరెడ్డిపేట మండలంలోని బొల్లారం హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ నరేష్‌రెడ్డి మంగళవారం తెలిపారు. బొల్లారం పాఠశాలకు చెందిన హారిక, రోజా(9వ తరగతి)తోపాటు కిరణ్(7వ తరగతి) ఉత్తమ ప్రతిభ కనబర్చి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.



పోటీలకు ఎంపికైన భవానిపేట విద్యార్థులు

నర్సరీ పనులను వేగవంతం చేయాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన హరితహారం నర్సరీ పనులను వేగవంతం చేయాలని నాగిరెడ్డిపేట ఎంపీవో శ్రీనివాస్ సూచించారు. బొల్లారం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు. గ్రామంలో ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శి సంతోష్‌ను ఆదేశించారు. దీంతోపాటు నూతనంగా నిర్మించే గృహాలకు అనుమతులివ్వాలన్నారు.

మధుమేహంపై విద్యార్థులకు అవగాహన



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని కాటేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ మధుమేహ(డయాబెటిస్) దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు వెంకటేష్ విద్యార్థులకు మధుమేహం రకాలు, దాని వల్ల కలిగే సమస్యలు, అలాగే ఆ సమస్య ఎందుకు వస్తుంది.. అనే విషయాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సహకార సంఘం వారోత్సవాలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో సహకార సంఘ వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సొసైటీ కార్యాలయం ఆవరణలో కార్యదర్శి విశ్వనాథం సొసైటీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



నిజాంసాగర్(జుక్కల్): అంగన్ వాడి కేంద్రాల్లో ప్రీస్కూల్‌కు వస్తున్న చిన్నారుల పట్ల టీచర్లు, ఆయాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి సూచించారు. మంగళవారం మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం గ్రామ అంగన్‌వాడి కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఆమె వెంట అంగన్‌వాడి టీచర్ స్వప్న ఉన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చుదిద్దుతా



గాంధారిలో మాట్లాడుతున్న మదన్‌మోహన్ రావు



పార్టీలో చేరుతున్న భిక్కనూర్ మాజీసర్పంచ్ వాసవి

- ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్

గాంధారి(ఎల్లారెడ్డి): చేతి గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని తెలంగాణాలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ రావు అన్నారు. మంగళవారం ఆయన గుడిమెట్, కరక్‌వాడి, బూర్గుల్, బూర్గల్ తండా, తిప్పారం, తిప్పారం తండా, సోమారం తండా, కొత్తాబాది తండా, జెమిని తండా, బీర్మల్ తండా, చద్మల్ తండా, చద్మల్, దుబ్బతండా, నేరల్, నేరల్ తండా తదితర గ్రామాల్లో పర్యటించారు. గడపగడపకు తిరిగి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలానికి వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ ప్రాజెక్టులు మంజూరు చేయిస్తానని, రైతులకు గిట్టుబాటు ధర లభించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సాగు నీటి కోసం కాళేశ్వరం ప్రాజెక్టు 22వ ప్యాకేజీ పనులు పూర్తయ్యేలా చూస్తానన్నారు. తనకు వచ్చే జీతం డబ్బులను నియోజకవర్గంలో వెనుక బడ్డ గ్రామాలు, తండాల అభివృద్ధికి వెచ్చిస్తానన్నారు. చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన భిక్కనూర్ మాజీ సర్పంచ్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): భిక్కనూర్ మాజీ సర్పంచ్ వాసవి మంగళవారం కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమెకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. నాయకులు ఈశ్వర్‌గౌడ్ తదితరులున్నారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయాలి



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేందర్



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వెంకటాపూర్ గ్రామస్తులు

- ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో బుధవారం నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సభకు నియోజకవర్గంలోని ప్రతి మండలం, గ్రామం నుంచి అధిక సంఖ్యలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు తరలిరావాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, జెడ్పీటీసీ ఉషాగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, తదితరులున్నారు.

సభ ఏర్పాట్ల పరిశీలన

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే జాజాల సురేందర్ మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని సాయినగర్ వెంచర్‌లో నిర్వహించే సభ స్టేజీ ఏర్పాట్లు, హెలిప్యాడ్ స్థలాన్ని ఆయన పరిశీలించారు.

బీఆర్‌ఎస్ పార్టీలో పలువురి చేరిక

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): వెంకటాపూర్‌కు చెందిన పలువురు నాయకులు మంగళవారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. నాయకులు సాయిలు తదితరులున్నారు.

ఎమ్మెల్యే జాజాలకు మద్దతు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎర్రాపహాడ్‌కు చెందిన కొంత మంది గ్రామస్తులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి సురేందర్‌కు మద్దతు తెలిపారు. మంగళవారం గ్రామంలో డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, సర్పంచ్ నర్సారెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు జలందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి మద్దతు ప్రకటించారు.

అభివృద్ధి పోచారంతోనే సాధ్యం

- డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి



బాన్సువాడలో ప్రచారం చేస్తున్న భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో మరింత అభివృద్ధి జరగాలంటే స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని పాత బాన్సువాడ గూడెంగల్లీ, చమాన్, కాముదుగల్లీ, నడిగడ్డ, దాసరిగల్లీ, శాంతినగర్, చైతన్య కాలనీల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో చేసిన అభివృద్ధి గురించి వివరించారు. కొంత మంది నాయకులు అబద్ధాలు చెబుతూ ఓట్ల కోసం వస్తున్నారని, ఆలోచించి కారు గుర్తుకు ఓటేయాలని అన్నారు. నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, జుబేర్, గడుమల లింగం, రవీందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నేడు బీఆర్‌ఎస్ పార్టీ యువ ఆత్మీయ సమ్మేళనం

బాన్సువాడ : సోమేశ్వర్ సమీపంలోని వెంచర్‌లో బుధవారం బీఆర్‌ఎస్ యువ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అంజిరెడ్డి తెలిపారు. పోచారం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే సమ్మేళనానికి బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలకు చెందిన యువత పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

ఆలయాల్లో కార్తీక మాస ఆకాశ దీపోత్సవాలు

కామారెడ్డి అర్బన్: కార్తీక మాసం ప్రారంభంలో భాగంగా మంగళవారం సాయంత్రం వివిధ ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కామారెడ్డి శారదా ఆదిశంకర ఆలయం, విద్యానగర్ విశ్వనాథేశ్వర ఆలయం, సిరిసిల్లరోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉదయం హనుమాన్ చాలీసా సామూహిక పారాయణం, సాయంత్రం భక్తి శ్రద్ధలతో ఆకాశ దీపోత్సవం నిర్వహించారు. డిసెంబర్ 14 వరకు ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటలకు ఆకాశ దీపోత్సవంతో పాటు దీపారాధన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలుంటాయని ఆలయాల ప్రతినిధులు పేర్కొన్నారు.



విశ్వనాథేశ్వర ఆలయంలో కార్తీక ఆకాశ దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు



సామూహిక పారాయణంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా బాలల దినోత్సవం



బాన్సువాడ: అంగన్‌వాడీ కేంద్రంలో నెహ్రూ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న చిన్నారులు



తాడ్వాయిలోని రవీంద్ర భారతి పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు అంశాలలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– సాక్షి నెట్‌వర్క్



జిల్లా కేంద్రంలోని ఆర్చిడ్స్ పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో..



నిజాంసాగర్: మంజీరా పాఠశాలలో..

బాలలకు ప్రత్యేక చట్టాలు



బాన్సువాడ రూరల్: బాలలకు రాజ్యాంగబద్ధంగా హక్కులతో పాటు ప్రత్యేక చట్టాలు రూపొందించారని బాన్సువాడ జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్ పేర్కొన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాన్సువాడలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి మాట్లాడారు. 14 ఏళ్లలోపు బాల, బాలికలందరూ తప్పకుండా ఉచిత నిర్బంధ విద్య పొందాలన్నారు. చదువుకునే వయసులో వారితో కర్మాగారాలు, కార్ఖానాల్లో కఠినమైన పనులు చేయించడం నేరమన్నారు. 2012 పోక్సో చట్టం గురించి వివరించారు. న్యాయవాదులు దత్తాత్రేయ, అజీమ్, అర్షద్, ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు.. ఆరు బ్రహ్మాస్త్రాలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలు.. ఆరు బ్రహ్మాస్త్రాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పరిశీలకులు జెట్టి కుసుమ కుమార్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 9 స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలవబోతోందని.. అత్యధిక మెజార్టీతో ఎల్లారెడ్డిలో మదన్‌మోహన్ గెలవనున్నట్లు తెలిపారు. 75 నుంచి 80 స్థానాలను గెలిచి కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టబోతున్నదన్నారు. నాయకులు విద్యాసాగర్‌రావు, సత్యనారాయణ ఉన్నారు.

నర్సరీ పరిశీలన

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారం గ్రామంలోని నర్సరీని ఎంపీడీవో రాము పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీలలోని బ్యాగుల్లో మట్టి పనులు జరుగుతున్నాయన్నారు. పనులు వేగవంతం చేయాలని స్థానిక పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.